"ఎక్కడ నొప్పి? నాకు కనబడటం లేదే? అదేమిటి? చెవిని కాదు నేను చూపించమన్నది...నొప్పిని."

"నొప్పిని ఎలా చూపించగలను స్వామీ? ఎవరికివారు అనుభవించే విషయం అది."

"భగవంతుడి విషయంలో కూడా అంతే జరుగుతుంది. ఎవరికి వారు అనుభవించి భగవంతుడ్ని చూడగలరు. భగవంతుడ్ని అనుభవించే దారిని పట్టుకోడానికి నేను సహాయం చేయగలను తప్ప భగవంతుడ్ని చూపించలేను."

## 19. విరాగి

ఓ అడవిలో, ఓ చెట్టు కింద ఒక యోగి తపస్సు చేసుకునేవాడు. అతని అలౌకిక సంపద గురించి విన్న ఆ దేశపు రాజు అతన్ని చూడటానికి వచ్చాడు. అయితే, అంతకు ముందురోజే ఆ యోగి హిమాలయాలకి వెళ్ళాడని తెలిసి ఆయన దర్శనం కలగనందుకు బాధ పడ్డాడు.

ఆయన వచ్చేలోగా ఆయన కోసం అక్కడ ఓ విశాలమైన మందిరాన్ని నిర్మించాడు. మూడేళ్ళ తర్వాత తిరిగి వచ్చిన యోగి తను కూర్చునే చెట్టు స్థానంలో ఉన్న ఆ మందిరాన్ని చూసాడు.

"రాజుగారు మీకోసమే దీన్ని కట్టించారు." చెప్పారు కాపలావాళ్ళు యోగితో.

బ్రహ్మజ్ఞానం తప్ప ఇంకే కోరికా లేని ఆ యోగి ఎంతో నిర్లిప్తంగా, నిరాసక్తంగా ఆ మందిరానికి దూరంగా ఉన్న ఇంకో చెట్టు కింద కూర్చుని తపస్సు చేసుకోసాగాడు.

## 20. యోగి-సంసారి

బ్రహ్మజ్ఞాన అన్వేషణలో ఇల్లు వదిలి వెళ్ళిపోయిన ఒకతని తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు అతని కోసం విలపించారు.

పన్నెండేళ్ళ తర్వాత వారంతా హిమాలయాల సందర్శనకి వెళ్ళారు. వారికి అనుకోకుండా ఆ యువకుడి దర్శనం లభించింది. కౌపీనంతో, జడలు కట్టిన జుట్టుతో, అలౌకిక పారవశ్యంలో ఉన్న అతన్ని చూసి 'అయ్యో! బిచ్చగాడిలా అయిపోయావా?' అని అంతా ఏడవసాగారు.

"మీరంతా సంసారపు లంపటంలో కూరుకుపోయినందుకు మీగురించి నేను ఏడుస్తూంటాను." నిర్వికారంగా చెప్పాడా యోగి.

## 21. విమర్శకి ఆహ్వానం

ఓ మహాత్ముడికి పదునైన నాలుక గల మిత్రుడున్నాడు. నిత్యం ఆ మహాత్ముడ్ని ఏదో ఒక విషయంలో ఘాటుగా విమర్శిస్తూండటం అతని అలవాటు.

ఓ రోజు ఓ శిష్యుడు ఆ మహాత్ముడి దగ్గరకి వచ్చి చెప్పాడు.

"గురూజీ! మిమ్మల్ని ఘాటు మాటలతో హింసించే మీ మిత్రుడు ఇప్పుడే మరణించాడు."

"అయ్యో! ఎంత పని జరిగింది? నాలోని అహాన్ని అణచివేసే నా ఆధ్యాత్మిక మార్గదర్శి పోయాడా?" అంటూ ఆ మహాత్ముడు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

సద్విమర్శ మనల్ని సరైన దారిలో పెడితే, కువిమర్శ మనలోని అహాన్ని అణచి సహనాన్ని పెంపొందిస్తుంది. కాబట్టి ఈ రెండూ ఆధ్యాత్మిక పథంలోనివారికి మేలైన మందులే.

## 22. పాఠం

వేదం నేర్చుకుని కాశీ నించి ఇంటికి ఓ పండితుడు తిరుగు ప్రయాణమయ్యాడు. దారిలోని ఓ ఊళ్ళో అతని దగ్గరకి ఓ పరిచారిక వచ్చి చెప్పింది.